# రాక్షస మూకలాగా ప్రవర్తిస్తున్న ప్రభుత్వం

*(ఇటీవల కొత్తగూడెంలో పౌర హక్కుల సంఘం నాయకుడు బాలగోపాల్‌పై పోలీసులు గూండాల ముసుగులో దాడి చేసిన సందర్భంగా రాష్ట్రంలో నేడు నెలకొన్న పౌరహక్కుల పరిస్థితులపై బాలగోపాల్‌తో వెంకట్ చేసిన ఇంటర్వ్యూను ప్రచురిస్తున్నాం*

*– సంపాదకుడు)*

ప్రశ్న : *ప్రస్తుతం రాష్ట్రంలో పౌరహక్కుల పరిస్థితి ఏమిటి? దానికి ప్రజల స్పందన, చైతన్యం ఎలా ఉందీ వివరిస్తారా?*

జ : రాష్ట్రంలో పూర్తిగా పోలీసుల రాజ్యం నడుస్తోంది. జనార్ధన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి బాహాటంగానే పోలీసులకు పూర్తి స్వేచ్ఛ నిచ్చాడు. రాజకీయ ఉద్యమాలను ప్రజా ఉద్యమాలను అణచడం కోసం పోలీసులు ఎన్‌కౌంటర్లను నిర్దాక్షిణ్యంగా అమలు చేస్తున్నారు. ఈయన అధికారంలోకి వచ్చి సంవత్సరం మూడు నెలలు కావస్తుంది. 1992 జనవరి నుండి ఇటీవలి వరకు దాదాపు 40 మందిని కిందటి సంవత్సరం 106 మందిని, అంతకు ముందు ఆయన అధికారంలోకి వచ్చిన నెలలో (డిసెంబరు 1990) ఇద్దరిని ఎన్‌కౌంటర్లలో కాల్చేశారు. ఇంత పెద్ద ఎత్తున ఎన్‌కౌంటర్లు చేయించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఇంతవరకూ ఎవరూ లేరు. ఈ ఎన్‌కౌంటర్లలో అమాయకులు గ్రామీణ ప్రజలు ఎక్కువగా చనిపోతున్నారు. ఇంత వరకు 10,000 మందిపై టాడా చట్టాన్ని మోపారు. ఇక ప్రజల స్పందన విషయానికొస్తే పోలీసు యంత్రాంగం అత్యాచారాల్ని అసహ్యించుకొంటున్నారు. వ్యతిరేకిస్తున్నారు. కాని సంఘటితమయ్యే అవకాశాన్ని వారికి ప్రభుత్వం ఏమాత్రం ఇవ్వడం లేదు. ఏమాత్రం మాట్లాడినా, మాట్లాడ దానికి ముందుకు వచ్చినా దాడి చేయడం, అంతో ఇంతో ఆలోచించే ఉద్యోగులు, డాక్టర్లు లాయర్లు కూడా ఇది అన్యాయమనడానికి భయపడుతున్నారు. ఇక గులాం రసూల్, నర్రా ప్రభాకర రెడ్డిల హత్యల తర్వాత సాధారణంగా ప్రజాస్వామిక హక్కుల గురించి తపించే విలేకరులు గానీ న్యాయవాదులు గానీ చాలా భయపడే పరిస్థితి కూడా ఏర్పడింది. ప్రజలలో చైతన్యం సంఘటితమై నిర్బంధాన్ని అధిగమించేటువంటి స్థితి ఇంకా రాలేదు. దాని కోసం కృషి చేయాల్సిన అవసరం చాలా ఉంది.

ప్రశ్న : *ప్రభుత్వవైఖరి ఈ విధంగా ఉన్నపుడు ప్రతిపక్ష రాజకీయ పార్టీల పాత్ర ఎలా ఉంది?*

జ : వారెవ్వరు కూడ ప్రజాస్వామ్యాన్ని కాపాడ్డం కోసం తాము చేయాల్సిన కృషిలో శతాంశమైనా చేయడం లేదు. అధికారంలో ఉంటే వారు కూడా ఇదేవిధంగా ప్రవర్తిస్తారు. అవగాహన రీత్యానే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ఏవిధంగా ప్రవర్తించాలి అన్న దాని గురించి ఒక ఖచ్చితమైన అభిప్రాయం ఏ పార్టీకి ఉన్నట్లు కనిపించడం లేదు. ఆ విషయంలో. ఈమధ్య కాలంలో ఒక్క సి.పి.ఐ. మట్టుకు రాజకీయంగా తమకు నక్సలైట్లతో అయినా మరెవరితో నయినా ఏ విభేదాలు ఉన్నప్పటికి కూడా ప్రభుత్వ- చట్టం ప్రకారం విచారించాలని కాల్చి పారేయడానికి వీల్లేదనే వైఖరిని తీసుకుంటోంది. మిగతా ప్రధాన ప్రతిపక్ష పార్టీలేవీ కూడా ఆ విధమైన వైఖరి తీసుకోవడం లేదు.

ప్ర : *రాజకీయ పార్టీల ప్రలోభాలు, వాగ్దానాలు ఒకవైపు, ప్రభుత్వ నిర్బంధం మరోవైపు ఉంటున్నా యువకులు ఎందుకు ఎక్కువగా విప్లవ రాజకీయాల వైపు ప్రభావితమవుతున్నారు?*

జ : యువతరంలో అసంతృప్తి, అసహనం చాలా ఎక్కువగా ఉంది. ఇవ్వాళ వాటికి ఒక వ్యక్తీకరణ ఇస్తున్నది సి.పి.ఐ ఎం.ఎల్ పార్టీలే కనుక వాటివైపు ఆకర్షితులవుతున్నారు. ఆ పరిస్థితి భవిష్యత్తులో పెరుగుతోంది తప్ప తగ్గదు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు కూడా ఆ దిశలోనే ఉన్నాయి. ప్రభుత్వం ప్రజల పట్ల తనకుండే సామాజిక బాధ్యతనంతా వదలి పెట్టేస్తుంది. ఆర్థిక రంగాన్ని లిబరలైజేషన్ అనే పేరు మీద దిగజారుస్తున్నది. దీంతో యువకులలో ఉండే అసంతృప్తి పెరుగుతోంది. ఆ పెరిగే అసంతృప్తికి ఏదో రకమైన తిరుగుబాటే సమాధానమవుతుంది. అందువల్ల ఇవాళ నిజంగా ఆందోళన చెందాల్సిన పరిస్థితులు ఏర్పడినాయి.

అప్పులు, షరతులు, అమలు చేస్తున్న పద్ధతి, దీనివల్ల రాబోయే ఐదు సంవత్సరాల్లో ధరలు చాలా వేగంగా పెరుగు తాయి. నిరుద్యోగం చాలా వేగంగా పెరుగుతోంది. ప్రభుత్వం నుండి ప్రజలు పొందుతన్న సదుపాయాలు చాలా వేగంగా తరిగిపోతాయి. ఆ నేపథ్యంలో అలజడి, ఆందోళన, తిరుగుబాటు, పోరాటం ఏ రాజకీయ నాయకత్వమైనా అనివార్యమవుతోంది.

ప్ర: *దీనిపై ప్రభుత్వం వైఖరి ఏమిటి?*

జ: ప్రభుత్వ వైఖరి స్పష్టంగా ఏం ఉంటుంది – మేం సమస్యలను గుర్తించి నిర్బంధం పెంచుకొంటూ పోతాం అని కానీ ఎవరైనా ఆందోళన చేస్తాం గొడవ చేస్తాం, అంటే తుపాకులు చూపిస్తాం – పోలీసును దించుతాం – మిలిటరీని దించుతాం – చంపుతాం –. అంటూ సమస్యల పట్ల వెకిలి వైఖరిని ప్రదర్శిస్తున్నాయి. ఇటీవల వికారాబాద్‌లో జనార్ధన్ రెడ్డి సబ్సిడి బియ్యం ధర గురించి మాట్లాడుతూ "ఆరోగ్యానికి రాగులు, సజ్జలు మంచివి రెండు రూపాయలకు కిలో బియ్యం తింటే ఆరోగ్యం చెడిపోతుంది" అని అంటాడు. ఒక సీరియస్ సమస్యపై ముఖ్యమంత్రి తీరు ఇది. పేదలను పేదలుగా ఉంచాలనే కుట్రలో భాగంగా సబ్సిడీ బియ్యం ధరను విమర్శిస్తున్నారని అంటాడు. ఈరకమైన వైఖరిగల ప్రభుత్వానికి సమస్యలకు పోలీసు పరిష్కారం, మిలిటరీ పరిష్కారం తప్ప వేరేది కనిపించదు. బహుశా నేనను కొంటా భవిష్యత్తులో ఈ పద్ధతి మరింత పెరుగుతుంది. కాని

తగ్గదు. కేవలం విప్లవ పార్టీల సమస్య కాదిది. అందరి సమస్య.

ప్రశ్న: తెలంగాణలో భద్రతా దళాలను తరలింపచేసి నిర్బంధాన్ని ఎక్కువ చేయడం కేవలం హయగ్రీవాచారి చంపినందుకేనా ?

జ: క్రమంగా పెరుగుతూ వస్తున్న నిర్బంధం ఇది. జనార్దన రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఒక పద్ధతి ప్రకారం, ఒక నిర్ణయం ప్రకారం జరుగుతూ వస్తుంది. ఒకప్పుడు మంత్రులు, శాసన సభ్యులు చాలామంది "ఈ నక్సలైట్ల సమస్య వెనుక సామాజిక కారణాలున్నాయి, అది రాజకీయ ఉద్యమం, సున్నితంగా వ్యవహరించాలి, చంపడం పరిష్కారం కాదు" అని అంటుండేవాళ్లు. ఇవ్వాళ బహిరంగంగా అనడం మానేశారు. భూమి సమస్య ఎక్కువుంది అని జనార్దన్ రెడ్డి అంటాడు. ఏ సమస్యాలేదని మైసూరారెడ్డి అంటాడు. పైగా నక్సలైట్లను మాఫియా గ్యాంగులుగా సంబోధిస్తారు.

ప్ర: అస్సాం, పంజాబ్‌లలో కేంద్ర ప్రభుత్వం సైనిక చర్యలు చేపడుతుంది కదా, సైనిక చర్యవల్ల ఆయా రాష్ట్రాల్లో సమస్యలు పరిష్కారమవుతున్నాయా దీనివల్ల తదుపరి పరిణామాలేమిటి ?

జ: పంజాబ్, అస్సాం లాంటి పెద్ద రాష్ట్రాలను తీసుకోనక్కర్లేదు నాగాలాండ్‌లోనే పరిష్కారం కాలేదు. 1956లో మొట్టమొదటగా నాగాలాండ్‌కు భారత సైన్యం పోయింది. ఆనాటి నుండి ఈనాటి దాకా 36 సంవత్సరాలయింది. జనాభాలో మూడవంతు సైన్యం అక్కడఉంది ఏం పరిష్కామయింది. ఉద్యమాలు పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. చంపుతూనే ఉన్నారు. ఎక్కడ కూడా మౌలికమైన సామాజిక, ఆర్థిక సంక్షోభాల నుండి పుట్టిన రాజకీయ ఉద్యమాలు సైనిక చర్యద్వారా అణచివేయబడలేదు. తాత్కాలికంగా వెనుకకుపోతే మళ్ళీ ముందుకు వస్తున్నాయి.

ప్రజాస్వామ్య దేశంలో ఉద్యమాలు ఎందుకు వస్తున్నాయి. ఆలజడి ఎందుకొస్తుంది - ఆందోళన ఎందుకొస్తుంది - శ్రీకాకుళం ఉద్యమం ప్రారంభమైనప్పట్టి నుండి ఎనిమిది వందల మందిని కాల్చేసినా ఇలా యువకులెందుకు ఉద్యమంలోకి ఎందుకు పోతున్నారు. ఎవరు ఆకర్షితులవుతున్నారు? అట్టడుగు వర్గాల యువకులు వారు. తిండి లేనోళ్లు, ఉద్యోగం లేనోళ్లు. కొంచెం కష్టం పడి బతికితే వాళ్ళు బతుకు వాళ్లు బతుకగలుగుతారు. అయినా అటు వంటి వాళ్లు ఎందుకు ఉద్యమాల వైపు పోతున్నారు అనే ఆలోచన, అవగాహన, సున్నితత్వం లేదు. కేవలం రాక్షస ముఠాలాగా ఆలోచించడం, దొంగల ముఠాలాగా ఆలోచించడం ప్రభుత్వం ప్రవృత్తి అయింది. పరిష్కారమెక్కడ దొరుకుతుంది? పంజాబ్‌లో పరిష్కారం లేదు. కాశ్మీర్‌లో పరిష్కారం లేదు. మురళీ మనోహర్ జోషి పోయి కాశ్మీర్‌లో జెండా నెగరేస్తాననంటే జెండా చూడ్డానికి కాశ్మీరీ ప్రజలు ఒక్కరు రాలేదంటే!? మరి ఏమిటి దేశం ఐక్యత ! ఎవరి కోసం కాశ్మీర్‌ను కాపాడుతున్నారు ? కాశ్మీర్‌ను కలుపుకోవడానికి ఎవరు ప్రయత్నం చేస్తున్నారు ? కాశ్మీర్ ప్రజలకు అవసరం లేని ఐక్యత ఎవరికి కావాలి ? అది భూభాగం ఐక్యతనా ? మనుష్యుల ఐక్యతనా?

ప్ర: ప్రస్తుత పరిస్థితిపై పౌరహక్కుల సంఘం వైఖరి ఏమిటి ?

జ: ఎట్టి పరిస్థితుల్లోనూ సైన్యాన్ని గానీ, పారా మిలిటరీని గాని సామాజిక సమస్యల నుండి పుట్టిన రాజకీయ ఉద్యమాల మీద ప్రయోగించడానికి వీల్లేదు. ఎందుకంటె సైన్యానికుండే తర్ఫీదు. శత్రువును సంహరించే తర్ఫీదు దేశ పౌరులు ఎప్పటికీ ప్రభుత్వానికి శత్రువులు కావడానికి వీల్లేదు. వీళ్లెంత ప్రభుత్వానికి వ్యతిరేకమైనా, పోరాటం చేసినా, తుపాకులు పట్టినా పౌరులే. శత్రువులపై ప్రయోగించాల్సిన సైన్యాన్ని పౌరులపై ప్రయోగాంచడానికి వీల్లేదు. పౌరులతో వ్యవహరించడానికి పోలీసు యంత్రాంగం ఉంది. ఆ పౌరులు తుపాకులు పట్టుకుంటే, నేరాలు చేస్తే, కిడ్నాపులు చేస్తే, హత్యలు చేస్తే అరెస్టు చేయడానికి, కేసులు పెట్టడానికి, వాళ్ల తుపాకులు గుంజుకోవడానికి, జప్తు చేసుకోవడానికి పోలీసు యంత్రాంగం ఉంది. పౌరులతో వ్యవహరించడానికావలసినక్షణను పోలీసు యంత్రాంగానికి ఇవ్వాలి దానికి ఉన్న విధులు లాంటివి. దానికుండే నియమావళి, ప్రమాణాలు కూడా అలాంటివి. అంతే తప్ప మిలిటరీని, పారా మిలిటరీని ఎప్పుడు ప్రయోగించడానికి వీల్లేదు. వాటిని పంపించేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం.

ప్రశ్న: ప్రజలకోసం పౌర హక్కుల కోసం ఎ.పి.సి.ఎల్.సి చాలా మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చింది కదా....

జ: మూల్యం చెల్లించామంటే చెల్లించాం. ఇంకా చెల్లిస్తాం. పౌరహక్కుల కోసం దెబ్బలు తినడానికి గానీ, ప్రాణాలు అర్పించడానికి గానీ సిద్ధంగా ఉన్నాం. అలా ఉన్నంత కాలం ఈ ఉద్యమం ముందుకు పోతూనే ఉంటుంది. కాని సమస్య ఈ ఉద్యమంతో పుట్టింది కాదు. ఈ ఉద్యమంతో అయిపోయేది కాదు; మాతో వుండేది కాదు. మాతో అయిపోయేది కాదు.

మమ్మల్నిందర్నీ చంపేస్తుంటే మరో వంద మంది పుడుతారు. డాక్టర్ రామనాథంను చంపేశారు. పౌరహక్కుల ఉద్యమం పెరిగింది. లక్ష్మారెడ్డిని చంపాక పౌరహక్కుల ఉద్యమం పెరిగింది. ఇది వాస్తవం. అతిశయోక్తి ఎంత మాత్రం కాదు. అది వాస్తవం. ఇంకా పెరుగుతూ వుంటుంది.

ప్ర: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా పౌరహక్కుల సంఘం భవిష్యత్తులో ఏమి చేస్తుంది ?

జ: ఉద్యమాన్ని ఇంకింత పెంచుకోడానికి ప్రయత్నం చేస్తాం. ఇప్పుడున్న భయ వాతావరణంలో చాలా మంది ముందుకు రావడానికి సిద్ధంగా లేరు. కాని ప్రయత్నమైతే చేస్తాం. అందరు రావాలనే ఆశిస్తాం, చెప్తుంటాం. ఇప్పుడు పౌరహక్కుల ఉద్యమం ఒంటరిగా ఉన్నది కాదు.. ప్రపంచ వ్యాప్తంగా దేశవ్యాప్తంగా ఉంది. అన్ని ప్రాంతాల్లోనూ సహకారమున్నది. ఆ అండను స్వీకరిస్తున్నాం. దానిని వుపయోగించుకొని మరింత ఎక్కువగా ప్రచారం చేయడానికి ప్రయత్నం చేస్తాం. అంతిమంగా పరిష్కారం ఎక్కడుందంటే ప్రజల్లో బాగా చైతన్యం రావాలి. భూమి కోసం పోరాటం చేసినట్టే కూలీ కోసం పోరాటం చేసినట్టే, ప్రజాస్వామ్యం కోసం పౌరహక్కుల కోసం కూడా పోరాటం చేసేటువంటి పరిస్థితి రావాలి. దానికోసం కృషి చేస్తున్నాం. దానికోసం ఎంతయినా చేస్తాం.